క్లుప్తంగా

నిధుల దుర్వినియోగంపై నోటీసులు జారీ

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు గ్రామ పంచాయతీలో లక్షల్లో నిధులు దుర్విని యోగమయ్యాయని ఫిబ్రవరి 7న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావు, కారంచేడు–2 ఎంపీటీసీ సభ్యులు యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఉన్నతాధికారు ఆదేశాల మేరకు ఇటీవల పంచాయతీకి సంబంధించిన రికార్డులను పరిశీలించి నివేదికను తయారు చేసి జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించినట్లు సమాచారం. దీంతో డీపీఓ కార్యాలయం నుంచి గ్రామ పంచాయితీ సర్పంచ్ బాలిగ శివపార్వతి, కార్యదర్శి బెనహర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసారు. వీటిలో గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం, పన్నుల వసూళ్ళ నిధుల దుర్వినియోగం, సిబ్బందికి చెల్లించాల్సిన జీతాల బిల్లుల దుర్వినియోగం, ఇతరుల పేర్లతో బిల్లుల మంజూరులో నిధుల దుర్వినియోగం వంటి అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

బైక్‌ను ఢీకొన్న లారీ


గాయపడిన యువకుడి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

మార్టూరు: బైక్‌పై వెళుతున్న యువకుడిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొట్టడంతో గాయాలపాలైన సంఘటన డేగర మూడి వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ మహ్మద్ బాషా అందించిన సమాచారం ప్రకారం మార్టూరుకు చెందిన చందోలు హసన్ బడా బుధవారం డేగరమూడి వైపు సర్వీస్ రోడ్డులో తన బైక్‌పై వెళుతున్నాడు. డేగరమూడి అడ్డరోడ్డు వచ్చే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీ కొట్టడంతో యువకుడు కింద పడి గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయాలైన అతనిని స్థానిక ప్రభుత్వవైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పేద మహిళలకు చేయూత



పేద మహిళలకు పింఛను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఇంకొల్లు (చినగంజాం): సేవే మా అజెండా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంకొల్లు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఐదుగురు పేద మహిళలకు రూ. 200 చొప్పున పింఛను అందజేశారు. ఒక ఏడాది పాటు పేద మహిళలకు ప్రతి నెలా ఇవ్వనున్నట్లు వాసవీ క్లబ్ అధ్యక్షులు చిన్ని పూర్ణారావు తెలిపారు. కార్యదర్శి బదరీ నారాయణ, బైసాని నరసింహం శెట్టి, అయ్యప్ప, కేసవరావు, సందీప్ పాల్గొన్నారు.

డెంగీ నివారణ చర్యలు

అద్దంకి: గరటయ్య కాలనీలో డెంగీ కేసు నమోదు కావడంతో, పరిసర ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది, మునిసిపల్ శానిటరీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతి ఇంటికీ సైఫనోత్రిన్‌ను పిచికారీ చేశారు. దీనిలో భాగంగా యూపీహెచ్‌సీ డాక్టర్ హకీం ఇళ్లలోని వారికి డెంగీ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీహెచ్ఈవో నీలం రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి రూరల్: మోసపూరిత కరపత్రాలపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అద్దంకి మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జె. దివాకర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రెండు రోజుల క్రితం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో ఎటువంటి సెక్యూరిటీ లేకుండా తక్షణమే పర్సనల్, బిజినెస్ లోన్‌లు ఇప్పిస్తానని గుర్తు తెలియని వ్యక్తి కరపత్రాలను అద్దంకి, పరిసర గ్రామాలకు పంచారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ

బల్లికురవ: వైకల్యం కలిగిన 14 సంవత్సరాలోపు చిన్నారులతో నిత్య వ్యాయామం, ఫిజియోథెరపీ పరీక్షలతో స్వస్థత పొందవచ్చని ఫిజియోథెరపిస్టు ఇందిరా ప్రియదర్శిని అన్నారు. బుధవారం వైదనలోని భవిత కేంద్రంలో 12 మంది చిన్నారులకు ఆమె పరీక్షలు నిర్వహించారు.

కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

చీరాల అర్బన్: పట్టణ పరిధిలోని కొత్తపేటలోని అబ్దుల్ కలాం కాలనీలో నూతనంగా నిర్మించనున్న టైలర్స్ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరి వాసు పాల్గొన్నారు. టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిట్రా శ్యామ్‌సుందర్, యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఇ.దుర్గారావు, వెంకటేశ్వర్లు, అజీద్, భాస్కర్ పాల్గొన్నారు.


వేమవరంలో హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది


పొలాలకు తరలిస్తున్న రాళ్లు



తయారైన హద్దురాయి

సమస్యలన్నీ తీరగా..

- భూ సమస్యలకు చెక్
- రీ సర్వేతో దశలవారీగా పాస్ పుస్తకాల పంపిణీ
- హద్దురాళ్లు ఏర్పాటు

బల్లికురవ: భూసమస్యలకు పరిష్కార దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష సమగ్ర భూసర్వే కొనసాగుతోంది. మండలాలవారీగా డ్రోన్ సర్వే, భూ సర్వే ఆఫ్ ఇండియా ద్వారా ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫెడ్ ఇమాజిన్) భూములకు సంబంధించి ఫొటోలు తీశారు. వ్యాలిడేషన్ తదుపరి సర్వే టీంతో రైతులకు ఉన్న హక్కు పత్రాలతో సాయంతో సర్వే చేస్తున్నారు.

19 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే

బల్లికురవ మండలంలోని వేమవరం, కూకట్లపల్లి, కొప్పరపాడు, వైదన, వల్లాపల్లి, బల్లికురవ, కొణిదెన, అద్దంకి మండలంలోని ఉప్పలపాడు, నరసింహపురం, ధర్మవరం, జె. పంగులూరు మండలంలోని కుందుర్రులో రీ సర్వే తుదిదశకు చేరింది. పూర్తయిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు చేయడంతో పాటు పాస్ పుస్తకాల పంపిణీ దశలవారీగా జరుగుతోంది. 2023 డిసెంబర్ మాసాంతంలోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అందుబాటులో హద్దు రాళ్లు

బల్లికురవలో రూ. 12.50 కోట్లతో సర్వే హద్దురాళ్ల తయారు చేసే ఫ్యాక్టరీలో ఉంది. పీఎండీసీ ఆధ్వర్యంలో తయారైన రాళ్లను ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు గుంటూరు, కృష్ణా జిల్లాలకు ఇక్కడ నుంచే రాళ్ల ఎగుమతి చేస్తున్నారు. రాష్ట్ర డీఎంజీ వెంకటరెడ్డి పర్యవేక్షణలో రోజుకు 5 వేల నుంచి 6 వేల వరకు రాళ్ల తయారు చేస్తూ ఇండెంట్ ప్రకారం తరలిస్తున్నారు. గ్రానైట్ పరిశ్రమల యజమానులు కూడా సర్వే హద్దు రాళ్ల తయారు చేస్తున్నారు. చీరాల ఆర్డీవో సరోజిని మాట్లాడుతూ డ్రోన్ సర్వేతో ప్రభుత్వ భూములు పంట కాల్వలు, డొంకలు, వాగులు విడగొడుతున్నామని చెప్పారు.

రీసర్వేతో పాస్ పుస్తకం ఇచ్చారు:



తనకున్న పొలానికి సంబంధించి రీ సర్వే టీమ్ హక్కు పత్రాలు పరిశీలించి కొలతలు తీశారు. ఆ తదుపరి భూహక్కుకు సంబంధించి పాస్ పుస్తకం అందజేశారు.

షేక్ ఖాదర్‌బాబు (బల్లికురవ)

రీసర్వే ఓ వరం:



డ్రోన్ సర్వే, గ్రౌండ్ ట్రూథింగ్ చేసి తన భూమిగా నిర్ధారించి హద్దు రాళ్ల ఏర్పాటు చేస్తున్నారు. భూసమస్యలకు చెక్ పడింది.

మేడగం యోగిరెడ్డి (ధర్మవరం)

నాడు–నేడు పనులు పూర్తి చేయాలి


పర్చూరులో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

పర్చూరు: పాఠశాలల్లో చేపడుతున్న నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గ స్థాయిలో ఎంఈఓలు, కాంప్లెక్సు హెచ్‌ఎం, ఏపీఎం, సీఆర్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలోని పాఠశాలలను వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏపీఎం తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 477 సచివాలయాల్లో ఏ ఒక్క లాగిన్‌లో పెండింగ్ టిక్కెట్ లేకుండా చేయాలన్నారు. ఏపీఎంలు నాడు–నేడు పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. ఎంఈఓ నాగేశ్వరరావు, యద్దనపూడి ఎంఈఓ సుబ్రమణ్యేశ్వరరావు, ఎంఈఓలు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు, ఏపీఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నరసరావుపేట వెళ్లి పింఛన్ అందజేత

అద్దంకి రూరల్: అనారోగ్యంతో ఉన్న వృద్ధురాలు సుజాత నరసరావుపేటలోని బంధువుల ఇంటిలో ఉంటోంది. దీంతో అద్దంకిలోని 7 వ సచివాలయం వలంటీర్ కె. సునీల్ కుమార్ బుధవారం నరసరావుపేట వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత


ఇసుక దరిశిలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సిబ్బంది

మార్టూరు: మండలంలోని ఇసుక దర్శి గ్రామ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. పౌష్టికాహార దినోత్సవం సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. భాస్కర్ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న పిల్లల్లో ఎదుగుదల నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, సిరప్ అందించి, అనీమియా నియంత్రిస్తున్నట్లు భాస్కర్ తెలిపారు. ఐదేళ్ల లోపు బాలబాలికలకు, గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ కిట్‌తో పాటు పాలు, గుడ్లు మెనూ ప్రకారం అందిస్తున్నట్లు అంగన్‌వాడీ కార్యకర్త రమాదేవి తెలిపారు. ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశ కార్యకర్తలు నాగమల్లేశ్వరి, రమ, ఆదిలక్ష్మి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చీరాల టౌన్: ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు అంతా పీడీఎఫ్ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కె.లక్ష్మణరావు సూచించారు. బుధవారం పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రజాసంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సమస్యలను శాసనసభలో పోరాడి సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించనున్న పీడీఎఫ్ అభ్యర్థులు వెంకటేశ్వర రెడ్డి, బాబురెడ్డిలను గెలిపించాలని సూచించారు. యూటీఎఫ్ నాయకులు భిక్షాలు, వినయ్, జానీ బాషా, సుభాని, జెవీవీ నాయకులు రామారావు, ప్రజాసంఘాల నాయకులు బాబూరావు, కృష్ణ మోహన్ ఉన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లు స్ఫూర్తి ఇవ్వాలి


ఎన్‌సీసీ క్యాడెట్లతో కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, డాక్టర్ సుభాషిణి

చీరాల: ఎన్‌సీసీ క్యాడెట్లు క్రమశిక్షణ, అంకితభావం, దేశభక్తి, నాయకత్వ లక్షణాలతో సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుని సమాజానికి స్ఫూర్తినివ్వాలని చీరాల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రవికుమార్ పేర్కొన్నారు. ఎన్‌సీసీ వేడుకలు బుధవారం కళాశాలలో జరిగాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు చదువుల్లోనూ రాణించాలని కోరారు. ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సుభాషిని మాట్లాడుతూ విద్యార్థులపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, వాటిని నిలబెట్టాలన్నారు. సుబేదార్ సంతోష్ కుమార్, హవల్దార్ గాలయ్య, హెచ్వోడీలు డాక్టర్ బషీర్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు జాగ్రత్త


ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

కారంచేడు: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల పట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రమేష్‌బాబు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన సమావేశంలో ఉపాధి ఫీల్డు అసిస్టెంట్‌లకు శిక్షణ తరగతిని నిర్వహించారు. ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని జాగ్రత్తలను ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. పనిముట్లు సమకూర్చడంతో పాటు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, టెంట్‌లు కూడా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఏపీఓ ప్రదీప్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల రికార్డులను అప్‌డేట్ చేయాలి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలలకు చెందిన అన్ని రకాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె. పద్మావతి అన్నారు. గురువారం కారంచేడులో ఆర్‌సీఎం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతు ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇవ్వబడిన ప్రతి రికార్డును అప్‌డేట్ చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం విజయమ్మ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో ఆరోగ్యం

చీరాల టౌన్: రోగాలకు కారణమయ్యే నులిపురుగుల నివారణకు ప్రభుత్వం పన్నెండేళ్లలోపు చిన్నారులకు అందించే ఆల్‌బెండజోల్ మాత్రలను విధిగా తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదేవి సూచించారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 1170 మంది ఓటర్లు

బల్లికురవ: ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు 1170 మంది ఓటు హక్కు పొందారని మండల ఎన్నికల అధికారి తహసీల్దార్ పి. సీతారత్నం బుధవారం తెలిపారు. వీరిలో పట్టభద్రులు 1138 మంది, ఉపాధ్యాయులు 32 మంది కాగా.. వీరంతా బల్లికురవ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. బీఎల్‌వోల ద్వారా ఓటరు స్లిప్‌లు అందజేస్తామని ఓటరు కార్డు, ఆధార్ కార్డుతో ఓటు హక్కు వినియోగించు కోవాలని కోరారు.

5న సంప్రోక్షణ కార్యక్రమం

చినగంజాం: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 5వ తేదీ నూతన ధ్వజ స్తంభ సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ఆదివారం వాస్తుహోమం, స్వామికి పంచామృతాలతో అభిషేకం, స్వామికి అన్నకూటోత్సవం, పుష్పయాగం, అల్పాహార విందు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తిరునాళ్లలో నిబంధనలు పాటించాలి

అద్దంకి రూరల్: శింగరకొండ 68 వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రభల నిర్వాహకులు పోలీస్ నిబంధనలను తప్పక పాటించాలని అద్దంకి సీఐ రోశయ్య బుధవారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభలపై ఎలాంటి పార్టీ జెండాలుగాని, గుర్తులు గాని పెట్టరాదన్నారు. ప్రభలపై నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల గురించి ముందుగా తెలియజేయాలని, అశ్లీల నృత్యాలు ప్రదర్శించరాదని తెలిపారు. నిర్వాహక కమిటీ సభ్యుల పూర్తి వివరాలు స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. ప్రభల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బారికేడ్లు కట్టి, వలంటీర్‌లను నియమించుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలకు, శింగరకొండ తిరునాళ్ల వద్ద తప్ప గ్రామాల్లో ఎలాంటి అనుమతి లేదన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోండి


మేదరమెట్లలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను వీక్షిస్తున్న అతిథులు, విద్యార్థులు

మేదరమెట్ల: రానున్న రోజుల్లో విద్యార్థులు డాక్టర్‌లు, శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఏఎస్ఐ మహ్మద్ ఆకాంక్షించారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ సందర్శించారు. స్కూల్ ప్రిన్సిపాల్, కరస్పాండెంట్‌లు.. విద్యార్థులను అభినందించారు.

మేలు జాతి దూడలతో లాభం


ప్రోత్సాహకాలు అందిస్తున్న అధికారులు

అద్దంకి: మేలు జాతి దూడలతో పశు పోషకులకు లాభం కలుగుతుందని.. డీఏహెచ్‌వో జెడ్పీ హనుమంతరావు అన్నారు. శంఖవరప్పాడులో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మేలు జాతి దూడల ప్రదర్శన కార్యక్రమంలో మాట్లాడారు. దూడలకు గేదె పాలు పూర్తిగా తాపించాలన్నారు. ముగ్గురు పోషకులకు ప్రోత్సాహకాలు ఇచ్చి సన్మానం చేశారు. ఈవో డీఎల్‌డీఏ డీడీ కాలేషా, డీడీ ఒంగోలు రమేశ్‌బాబు, ఏడీ మోహనరావు, వెటర్నరీ అసిస్టెంట్ శిరీష, పశుపోషకులు పాల్గొన్నారు.

బుక్ డిపాజిట్ సెంటర్‌తో విజ్ఞానం


సెంటర్‌కు పుస్తకాలను ఇస్తున్న గ్రంథ పాలకుడు

సంతమాగులూరు (అద్దంకి): బుక్ డిపాజిట్ సెంటరుతో విజ్ఞానం పెరుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. గ్రంథాలయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని గురిజేపల్లి గ్రామంలో బుధవారం బుక్ డిపాజిట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వారపత్రికలు, దిన పత్రికలు, వివిధ రకాల పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. కేంద్రాన్ని నూతలపాటి కిరణ్ పర్యవేక్షిస్తారన్నారు. సర్పంచ్ గుంటి పెద్దబ్బాయి, కార్యదర్శి నక్క బ్రహ్మనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మద్దతు పలికిన మున్సిపల్ కౌన్సిలర్


ఎమ్మెల్యే పక్షాన చేరిన కౌన్సిలర్ మొగిలి దీపిక

చీరాల: పట్టణంలోని ఒకటో వార్డు కౌన్సిలర్ మొగిలి దీపిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పక్షంలో చేరారు. వార్డు అభివృద్ధిని కాంక్షించి ఎమ్మెల్యే కరణం బలరాం, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చీరాల నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నారని, ఆ అభివృద్ధిని చూసి తాము ఆయన పక్షాన పనిచేయాలని చేరామన్నారు. మొగిలి దీపిక, ఆమె భర్త, మాజీ కౌన్సిలర్ మొగిలి బాబ్జిలను ఎమ్మెల్యే కరణం బలరాం సాదరంగా ఆహ్వానించారు. నాయకులు దాసరి శ్రీకాంత్, మల్లి నవీన్, నల్లగండ్ల ప్రభాకరరావు, మొగిలి శ్రీనివాసరావు, మొగిలి జయ, కొండ్రగుంట ఈశ్వర్, డి. శేషగిరిరావు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు శ్లాఘనీయం


చీరాల : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంస్మరణ సభ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు


అద్దంకి : మాదిగ అమర వీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చీరాల రూరల్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంలో పోరాడుతూ అగ్నికి ఆహుతై అమరులైన మాదిగ సోదరుల త్యాగాలను వృథాగా పోనివ్వమని ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య అన్నారు. బుధవారం స్థానిక ముక్కోణం పార్కు సెంటర్లోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల అమలు విషయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ సోదరులకు సానుకూలంగా వ్యవహరించి ఆ తరువాత మాట మార్చడంతో మాదిగ సోదరులు కలత చెందారని చెప్పారు. హైదరాబాదులోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద సోనియా గాంధీ ఏర్పాటు చేసిన సభలో మాదిగ సోదరులు నిరసన తెలుపుతూ మందా కృష్ణ నాయకత్వంలో గాంధీ భవన్‌ను తగలబెట్టారని ఆ సంఘటనలో ఐదుగురు మాదిగలు అగ్నికి ఆహుతయ్యారన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం కనికరం చూపకుండా మాదిగ సోదరులకు అన్యాయం చేసిందని చెప్పారు. ఎప్పటికైనా ప్రభుత్వాల మెడలువంచి ఎస్సీ వర్గీకరణ అంశాలను సాధించి తీరుతామని ఆయన పేర్కొన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సాయి రత్నబాబు, మనోహర్, ప్రసాద్, అప్పారావు, రాంబాబు, దినేష్, డేవిడ్, చిన్న, నాగరాజు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరులకు ఘన నివాళి

అద్దంకి రూరల్: మాదిగ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అమర వీరులకు ఘనంగా నివాళులర్పించారు. దీనిలో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గోచిపాతుల రవికుమార్, నాగిపాము చక్రవర్తి, మందా అయోస్, తేళ్ల శ్రీనివాస్, పసుమర్తి శ్రీను, కొలకలూరి ప్రసాద్, మందా లాజర్ పాల్గొన్నారు.